క్లుప్తంగా

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన డీఎస్పీ



పెడన: మచిలీపట్నం డీఎస్పీ మాధవరెడ్డి గురువారం పెడన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డీఎస్పీని అభినందించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, బళ్ల గంగయ్య పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



చిలకలపూడి(మచిలీపట్నం): పదో తరగతిలో జిల్లాలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ రాజాబాబు ఆయన చాంబర్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి 592 మార్కులు సాధించిన ఆకుల ప్రేమ్‌సాయి, అదే పాఠశాలలో చదివి 586 మార్కులు సాధించిన భావిశెట్టి కావ్యశ్రీ లను కలెక్టర్ రాజాబాబు సత్కరించి అభినందనలు తెలిపారు. డీఈఓ తాహెరాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో మాజీ డీజీపీ ఠాగూర్



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని మాజీ డీజీపీ ఆర్పీ ఠాగూర్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి కల్యాణోత్సవాలు

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లి గ్రామంలోని బాలా పార్వతి సమేత రామేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 17న ఉదయం 11 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారునిగా చేస్తారు. రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం జరుగుతుంది. 18న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి దివ్య కల్యాణోత్సవం, 19న ఉదయం 6 గంటలకు సుప్రభాతసేవ, వసంతోత్సవం, పూర్ణాహుతి అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పండిత సత్కారం, 20న పూర్ణాహుతితో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

ఆర్థిక సాయం అందజేత



పెడన: లంకల కలువగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త మద్దాల నాగరాజు భార్య రత్నకుమారి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ గురువారం నాగరాజు నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీసి పార్టీ పరంగా రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమెతో మాట్లాడుతూ అధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, గరికపాటి వెంకట రామానాయుడు, పామర్తి సాంబశివరావు, గంథం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష తమలపాకులతో పూజ

బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలోని వీరాంజనేయస్వామి మందిరంలో గురువారం లక్ష తమలపాకులతో పూజ వైభవంగా నిర్వహించారు. పండితులు ఐలూరు జైకిషోర్ శిష్య బృందం వేద మంత్రాల మధ్య లక్ష నామాలతో తమలపాకు పూజ, విశేష హోమాలు జరిగాయి. గ్రామ పెద్దలు, మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

- నాడు-నేడు ద్వారా 11 రకాల మౌలిక వసతులు
- కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): సుస్థిరాభివృద్ధిలో ఎనిమిది ప్రాధాన్యత సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు పాల్గొని జిల్లా ప్రగతిని సీఎస్‌కు వివరించారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో 11 రకాల మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 1344 పాఠశాలల్లో నూరుశాతం విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు వయసు కలిగిన పిల్లల్లో 1823 మంది బరువు తక్కువ, 2,397 మంది ఎత్తు తక్కువ పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు

అవ్వాతాతలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించండి

డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా జిల్లాలో 60 ఏళ్లు దాటిన అవ్వాతాతలకు కంటి వైద్య పరీక్షలకు సంబంధించి 2,12,697 మందికి పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 1,19,177 మందికి పరీక్షలు నిర్వహించి 44 వేల మందికి కళ్లజోళ్లను అందజేశామన్నారు. 9,641 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కాగా వీరిలో 1,823 మందికి ఆపరేషన్లు నిర్వహించామన్నారు. ఆధార్ నవీకరణ అంశంలో ఆరేళ్లలోపు వయసు కలిగిన 62 శాతం మందికి పూర్తి చేశామని, మిగిలిన వారికి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్పందన రీ-ఓపెన్ అర్జీలలో ఏప్రిల్ 26 నుంచి ఇప్పటి వరకు 215 అర్జీల్లో 20 అర్జీలు రీ-ఓపెన్ అయ్యాయని, వీటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా 166 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 108 తరగతి గదుల నిర్మాణం బేస్‌మెంట్ లెవల్‌లో ఉందని, 23 రూఫ్ లెవల్, 32 శ్లాబ్ లెవల్, ఆరు తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. 154 పాఠశాలలకు ప్రహరీ నిర్మిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, డీఎంహెచ్ఓ జి. గీతాబాయి, సీపీఓ వై. శ్రీలత, కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, డీఈఓ తాహెరాసుల్తానా, సమగ్ర శిక్షా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క డ్రాపవుట్ కూడా ఉండకూడదు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం క్యాంపు కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా వ్యవస్థ నాడు-నేడు, ధాన్యం కొనుగోలు, మొక్కజొన్న సేకరణ, రీ-సర్వే, గృహ నిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ఏ ఒక్కరు డ్రాపవుట్‌గా మిగిలి ఉండకూడదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సంపూర్ణ పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పక్కాగా అమలు చేయాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా విద్యా బోధన చేయాలని చెప్పారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కాకపోతే బాధ్యులైన వారికి చార్జిమెమోలు జారీ చేస్తామన్నారు. పదో తరగతిలో 550 మార్కులు సాధించిన పేద విద్యార్థులను ప్రైవేటు కళాశాలల్లో చేర్పించాలని, వారికి విద్యాపరమైన రాయితీలు అందేలా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఖాళీలు ఆర్థికంగా వెనుకబడిన కులాల వారికి భర్తీ అయ్యేలా దృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 14 మొక్కజొన్న సేకరణ కేంద్రాలను ప్రారంభించామని, 950 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను రైతుల నుంచి సేకరించామని చెప్పారు. మొక్కజొన్న సేకరణ ముమ్మరంగా చేపట్టి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.

బందరు, ఉయ్యూరు డివిజన్లలో ధాన్యం సేకరణకు సంబంధించిన నగదును సంబంధిత రైతులకు త్వరితగతిన చెల్లించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో శనివారం లోగా ఆరు వేల సరిహద్దు రాళ్లను అమర్చేలా పనులు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో 3 లేదా 4 రోజులు కచ్చితంగా పర్యటించాలని, దీని ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు



హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

పెడన: పొదుపు సంఘాల ద్వారా రూ.35 వేలు రుణం తీసుకుని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని హౌసింగ్ డీఈ ఎ. శ్రీనివాసరావు అన్నారు. ఆ తరువాత ప్రభుత్వమే ఇసుక, ఇనుము, సిమెంటు ఇస్తుందని చెప్పారు. గురువారం ఆయన 11వ వార్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్డు హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. అన్ని వార్డుల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు 90 శాతం మంది ముందుకు వచ్చారని, ఇక్కడ కేవలం 40 శాతం మంది మాత్రమే వచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను సద్వినియోగం చేసుకుని సొంత ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్ ముత్యాల మురళి మాట్లాడుతూ లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు, ఆర్పీలు, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన బందరు డీఎస్పీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

బంటుమిల్లి: బందరు డీఎస్పీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ వై. మాధవరెడ్డి గురువారం తొలిసారి బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఎస్ఐ ఎ. పైడిబాబును పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. పెడన సీఐ ప్రసన్నవీరయ్యగౌడ్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

అవనిగడ్డ: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. ద్వారకా తిరుమలకు బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని పెదపూడి నుంచి ఎం. రామచంద్రరావు కోరారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లికి, ఘంటసాల నుంచి మచిలీపట్నం, చల్లపల్లికి, కోడూరు నుంచి రేపల్లెకు, అవనిగడ్డ నుంచి తెనాలికి, పూషడం నుంచి మచిలీపట్నానికి, అవనిగడ్డ నుంచి కాకినాడకు, కృత్తివెన్ను మీదుగా నరసాపురానికి, గుడివాడకు రాత్రి సర్వీస్‌ని 7.30కి పెంచాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వీసుల పెంపునకు కృషి చేస్తామని డీఎం తెలిపారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులు, భక్తులు

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల అంజనేయ స్వామి ఆలయం నుంచి గురువారం శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో భక్తులు బైక్‌లకు కాషాయ జెండాలు కట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ నెల 14వ తేదీన జరగనున్న హనుమత్ జయంతిని పురస్కరించుకుని శోభాయాత్ర నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. శ్రీరామ నామం, హనుమంతు నామ స్మరణ మార్మోగింది. ఎస్ఐ ఎ. పైడిబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సుందరాకాండ పారాయణం

బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల అంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమత్ జ్జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం పురాణ ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి సుందరాకాండ విశిష్టతను వివరిస్తూ సుందరాకాండ హోమం నిర్వహించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయభారతి



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న విజయభారతి

గుడివాడరూరల్: వ్యవసాయశాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయభారతి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో గురువారం గుడివాడ, పెదపారుపూడి, నందివాడ మండలాల వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులతో నూరు శాతం ఈకెవైసీ చేయించాలని చెప్పారు. ఎరువులు ముందుగానే ఆర్‌బీకే కేంద్రాల్లో పొజిషన్ చేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందరికి సబ్సిడీపై పంపిణీ చేయాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో పంటల నమోదుకు ముందుగానే రికార్డులను సరి చూసుకోవాలని సూచించారు. సిబ్బంది.. రైతులతో మమేకమై సహకరించాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయశాఖ డీడీఏ మనోహర్, ఏడీఏ రమాదేవి, వ్యవసాయశాఖ అధికారులు బి.అనంతలక్ష్మి, త్రినాధ ఆంజనేయరావు, శ్రీధర్, ఏఓ ప్రియాంక, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

ప్రభుత్వం రైతులకు భూమిని సారవంతం చేసేందుకు ఉచితంగా ఇచ్చే జీలుగ విత్తనాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభారతి బొమ్ములూరు రైతుభరోసా కేంద్రం వద్ద గురువారం పంపిణీ చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి అనంతలక్ష్మి, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ టి.సాయిమౌనిక, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు: రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించుకోవాలని పామర్రు మండల వ్యవసాయసలహా మండలి అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతుభరోసా కేంద్రంలో బుధవారం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శివ నాగరాణి, రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ రామోజీ నాయక్

గుడ్లవల్లేరు: పేదల సొంతింటి కల సాకారమే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ డీఈ రామోజీ నాయక్ అన్నారు. పెంజెంద్రలోని జగనన్న గృహ నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. జగనన్న కాలనీలో 168 గృహ నిర్మాణాలకు 155 నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టీడీపీ హయాంలో నిలిచిన 50ఇళ్లను కూడా త్వరలో నిర్మించనున్నామని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల గుడ్లవల్లేరు మండల కన్వీనర్ బలుసు జితేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రేమల్లి తాతబ్బాయ్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యలమర్రు(పెదపారుపూడి): జగనన్న కాలనీలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో త్వరితగతిన నిర్మాణాలు మొదలుపెట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి అన్నారు. యలమర్రు సచివాలయం వద్ద గురువారం హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నిర్మాణ పనులు ప్రారంభించిన వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, వెలుగు ఏపీఎం వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ప్రయాణానికి బస్సు ఏర్పాటు

మోపిదేవి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న మహాయజ్ఞానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం తరపున ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని ఆలయ ఏసీ చక్రధరరావు తెలిపారు. ఈ బస్సు శుక్రవారం ఉదయం 8 గంటలకు మోపిదేవి గుడి నుంచి బయలు దేరుతుందని చెప్పారు.

జయప్రదం చేయండి..

మచిలీపట్నంటౌన్: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు జరుగనున్న శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పరాసుపేట సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన శిబిరం

మచిలీపట్నంటౌన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నాలుగో రోజు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు పుస్తకాలు చదివించి కథలు చెప్పారు. పాటలు పాడించడంతో పాటు డ్యాన్స్ చేయించారు. అనంతరం ధ్యానం చేయించి భగవద్గీత శ్లోకాలను చెప్పించారు. లెక్కలు నేర్పారు. సుమారు 40 మంది విద్యార్థులు శిబిరానికి హాజరయ్యారు. ఉదయం సరస్వతీదేవి ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీవీ సత్యనారాయణ విద్యార్థులకు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎం. విజయ, ఉమా సరస్వతి భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. ఉపాధ్యాయిని జి. దుర్గాభవాని విద్యార్థులకు లెక్కలు నేర్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీఓ డి. సుబ్బారావు తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదన రావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఘంటసాల(అవనిగడ్డ): మండల పరిధిలోని శ్రీకాకుళంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభిస్తారని ఏఓ కె. మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండల పరిధిలో 2,078 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మార్క్‌ఫెడ్ వారు క్వింటాల్‌కు రూ.1,962 కనీస మద్దతు ధరకు మొక్కజొన్నను కొనుగోలు చేయనున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీలు, బీసీల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పర్రచివర(నాగాయలంక): రాష్ట్రంలోని ఎస్సీలు, బీసీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, దీనిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక కుటిల ప్రచారంతో ఆయా వర్గాలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పర్రచివర సచివాలయ పరిధిలోని బిల్లీగ్రాహం నగర్‌లో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

గ్రామంలోని 294 గృహాలకు తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు చదివి వినిపించి సంబంధిత పత్రాలు అందించారు. గ్రామ పాలనా వ్యవస్థను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరిశె ఏసయ్య, గుంటూరు సురేష్, మండల ఆర్ఐ నరహరిశెట్టి నందు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యదర్శులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే పేర్ని నాని



అధికారులతో మాట్లాడుతున్న పేర్ని నాని చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): నియోజకవర్గ పరిధిలోని భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే గురువారం సమావేశమయ్యారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైలు మార్గాన్ని రెండో దశ భూ సేకరణలో ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చే యాలని కోరారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డి, ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సాంబశివరావు, ఈఈ ఎం. భాస్కరరావు, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్డీఓ ఐ. కిషోర్, ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మి, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ రాధిక పాల్గొన్నారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ



అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దంపతులు

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారం వైభవంగా జరిగాయి. వివిధ పీఠాధిపతులు వాసుదేవానందగిరి స్వామీజీ, త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి, విజయానందగిరి స్వామీజీ, కమలానంద స్వామీజీల ఆశీస్సులతో ఉదయం 9.36 గంటలకు గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ, కాలభైరవ, నవగ్రహ, జీవ ధ్వజస్తంభ సహిత అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్ల నూతన శిలా విగ్రహాల ప్రతిష్ఠ, యంత్రస్థాపన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెనాలి ప్రధాన అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ దుర్గా హరిబాబుస్వామి బృందం, వేద పండితులు, రుత్వికుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు పూజాధికాలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పేర్ని నాని, నాయకులు

మచిలీపట్నంటౌన్: బందరు పోర్టు అభివృద్ధి పనులను ఈ నెల 22వ తేదీన ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభను నగర పరిధి సర్కారు తోటలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థలంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఉదయం నుంచి ఈ స్థలంలో సభ ఏర్పాట్ల పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సర్కారుతోట స్విమ్మింగ్‌పూల్ పక్కన ఉన్న ఈ ఆవరణలోని ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలను తొలగించి నేలను చదును చేస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ తదితరులు పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ టౌన్: ప్రభుత్వ సాంకేతిక (ఐటీఐ) విద్య కోర్సుల్లో అడ్మిషన్లకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ హరిధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను సమీపంలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ద్వారా అప్రూవల్ చేయించుకోవాలని తెలిపారు. జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08674-295953, 8555952320లో సంప్రదించాలని కోరారు.

ఐడీఓ కోర్సుకు..

పామర్రు(ఎలకుర్రు): గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ఆధ్వర్యాన నడుపుతున్న డైట్‌కు సమానమైన డిప్లమో ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(ఐడీవో) కోర్సులో అడ్మిషన్లను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యూషన్ ఫీజు లేదని, రెండేళ్ల కోర్సని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95008 85168, 99591 03956లో సంప్రదించాలని సూచించారు.